నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, ఆదివారం 27 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL


# రైతన్నకు నష్టం

## ఒక రోజు ఆలస్యంగా సీసీఐ పత్తి కొనుగోళ్లు

- క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521
- రూ.6,840తో కొనుగోలు.. రూ.681 నష్టం
- లక్షల రూపాయలు కోల్పోయిన కర్షకులు



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తి వాహనాలు

ఆదిలాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రైవేటు వ్యాపారుల అవకాశవాదం ఫలితంగా ఆదిలాబాద్ జిల్లా రైతులు ఆదిలోనే కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభంకావాల్సిన కొనుగోళ్లు.. సీసీఐ అధికారులు తేమ పేరిట కొర్రీలు పెట్టడంతో ఒక రోజు ఆలస్యంగా శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రంగా రైతులు పంటకు కాపలాగా ఉన్నారు. 24 గంటలపాటు తిండి, తిప్పలు లేక సీసీఐ అధికారులు కొనకపోవడంతో తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి ఇంటిబాట పట్టారు. మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు.



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న సిబ్బంది

### ఆందోళన చేసినా ఫలితం శూన్యం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉండగా.. 300లకుపైగా వాహనాల్లో రైతులు పంటను సీసీఐకి అమ్మడానికి తీసుకొచ్చారు. పంటలో తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించి సేకరణకు నిరాకరించారు. దీంతో రైతులు తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ఇందుకు వారు ఒప్పుకోకపోవడంతో ప్రైవేటు వ్యాపారులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీలు చర్చలు జరిపారు. క్వింటాలుకు రూ.7,200 చెల్లిస్తామని చెప్పిన వ్యాపారులు 8 నుంచి 12 తేమ శాతం నిబంధన అమలు చేస్తామన్నారు. వ్యాపారులు తేమతో సంబంధం లేకుండా కొనాలని కోరినా వారు అంగీకరించలేదు. దీంతో రైతులు ఆందోళన చేపట్టారు. ఆదిలాబాద్, జైనథ్ రహదారిపై ధర్నా చేశారు. దీంతో అధికారులు, ప్రైవేటు వ్యాపారులు దిగిరాకపోవడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకుంది. చివరకు తేమతో సంబంధం లేకుండా క్వింటాలుకు రూ.6840 చొప్పున ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడానికి నిర్ణయించారు. ఈ ధర ఫలితంగా రైతులు క్వింటాలుకు రూ. 681 నష్టపోవాల్సి వచ్చింది. ఒకరోజు కొనుగోళ్ల ఫలితంగా రైతులకు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది.

### ❖ క్వింటాలుకు రూ.10 వేలు చెల్లించాలి..



*నేను 22 క్వింటాళ్ల పత్తిని శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. సీసీఐ అధికారులు తేమ ఎక్కువగా ఉందని కొనుగోలు చేయలేదు. ప్రైవేటు వ్యాపారులు మంచి ధర చెల్లిస్తారని ఆశపడినా ఫలితం లేకుండా పోయింది. పంటను అమ్ముకోవడానికి శుక్రవారం పొద్దున నుంచి శనివారం పొద్దున 11 గంటల వరకు మార్కెట్ యార్డులో పడిగాపులు కాసినా. చివరకు ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.6840 చొప్పున కొనడానికి ఒప్పుకున్నారు. సీసీఐ రూ.7521 మద్దతు ధర చెల్లిస్తే నష్టం వచ్చేది కాదు. సాగులో పెట్టుబడులో బాగా పెరిగాయి. క్వింటాలుకు కనీసం రూ.10 వేలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయాలి.*

**- శివ్వన్న, సిర్సన్నగూడ, జైనథ్ మండలం**

### ❖ రూ.25 వేలు నష్టపోయా..



*నేను 35 క్వింటాళ్ల పత్తిని అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. తేమ ఉందని సీసీఐ అధికారులు పత్తిని తీసుకోలేదు. తేమ లెక్కించగా 19 శాతం వచ్చింది. సీసీఐ అధికారులు తేమ 12 లోపు ఉంటేనే తీసుకుంటామన్నారు. ప్రారంభంలో పంటతో తేమ కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. సీసీఐ కొనకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు క్వింటాలుకు రూ.6840 చొప్పున పంటను అమ్ముకున్నా. ప్రైవేటోళ్లకు అమ్మడంతో క్వింటాలుకు రూ. 681 చొప్పున రూ.25 వేల వరకు నష్టం జరిగింది. రెండ్రోజులుగా మార్కెట్‌లో తిండి, తిప్పలు లేకున్న గడిపి చివరకు చేసేదేమీ లేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. రైతుల గోస ఎవరు పట్టించుకోవడం లేదు.*

**- జీవన్, కజ్జర్ల, తలమడుగు మండలం**



పద్మశ్రీ కనక రాజు

# ఇక సెలవు..

- నివాళులు అర్పించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు
- వందలాదిగా తరలివచ్చిన ఆదివాసులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ) : ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన పద్మశ్రీ కనక రాజు శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కనక రాజు అంత్యక్రియలు అతని స్వగ్రామమైన జైనూర్ మండలంలోని మార్లవాయిలో శనివారం జరిగాయి. ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించగా.. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొని నివాళులు అర్పించారు. ఆదివాసులకు ప్రత్యేకమైన గుస్సాడీ నృత్య ప్రత్యేకతను దేశవ్యాప్తంగా ప్రచారం చేయడంతోపాటు సంస్కృతీ అభివృద్ధికి కృషి చేసినందుకు కేంద్రం విశిష్ట పురస్కారమైన పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. తమ జాతికే గర్వకారణంగా నిలిచిన కనక రాజుకు ఆదివాసులు సంప్రదాయబద్ధంగా వీ డ్కోలు పలికారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివాసులు తరలివచ్చి అంత్యక్రియ ల్లో పాల్గొన్నారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించి, గాలిలోకి కాల్పులు జరిపారు.

### సేవలు అనిర్వచనీయం..

ఆదివాసుల సంస్కృతిని కాపాడుతూ ప్రపంచానికి చాటిచెప్పిన కనక రాజు తమ జాతికి చేసిన సేవలు అనిర్వచనీయమైనవని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గుస్సాడీ నృత్యాన్ని అభివృద్ధి చేసి భావితరాలకు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించిందన్నారు. మారుమూల గ్రామమైన మార్లవాయి ప్రాంతానికి చెందిన ఆదివాసీకి పద్మశ్రీ లభించడం గర్వకారణమన్నారు. మార్లవాయిలో నృత్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువకులకు తమ ఆచారాలను నేర్పించారని అన్నారు. ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలకు పేరు తీసుకొచ్చిన ఆయన మరణం తీరని లోటని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గుస్సాడీ పేరు వింటేనే గుర్తుకొచ్చే కనక రాజు తమ ఆచారాలను భావి తరాలకు అందించేందుకు తన జీవితాన్ని దారపోశారని అన్నారు. పద్మశ్రీ పురస్కారాన్ని పొందిన కనక రాజు ఆదివాసీ జాతికే ఆణిముత్యం అని పేర్కొన్నారు. ఆయన సేవలను జాతి మరచిపోదన్నారు. కనక రాజు అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్, నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సార్‌మేడీలు, రాయిసెంటర్ల ప్రతినిధులు, హేమన్ డార్ఫ్ ఆదివాసీ యువకులు, ఆదివాసీ గ్రామాల పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కనక రాజు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



అధికారిక లాంఛనాల్లో భాగంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



వివిధ ఫ్లెక్సీలతో రోడ్డుపై బైఠాయించిన బెటాలియాన్ కుటుంబ సభ్యులు, పిల్లలు



మహిళా కానిస్టేబుల్‌తో వాగ్వాదం చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుల్ భార్య

# రోడ్డెక్కిన పోలీసు కుటుంబాలు

## 'ఒకే రాష్ట్రం-ఒకే పోలీసు వ్యవస్థ'ను అమలు చేయాలని డిమాండ్

- పోలీసు కుటుంబాలు, సివిల్ పోలీసుల మధ్య తోపులాట
- తల్లి ఒడిలో నుంచి కింద పడిపోయిన రెండేండ్ల బాలుడు
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన

ఎదులాపురం, అక్టోబర్ 26 : 'ఒకే రాష్ట్రం-ఒకే పోలీసు వ్యవస్థ'ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఎస్పీ రెండో బెటాలియన్‌కు చెందిన పోలీసు కుటుంబాలు రోడ్డెక్కాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌరస్తా వద్ద రెండో బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల భార్యలు, వారి పిల్లలు శనివారం పాత జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. పోలీస్ వ్యవస్థలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. రోడ్డుపై నుంచి వెళ్లాలని సూచించినా.. వెళ్లక పోవడంతో బలవంతంగా లేపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రోడ్డుపై తల్లిబిడ్డలు కూర్చొని ఉండడంతో మహిళా కానిస్టేబుల్ అతి ఉత్సాహంతో తల్లిని లాగేసింది. దీంతో తల్లి ఒడిలో ఉన్న ఆ బిడ్డ కింద పడిపోయింది. ఇరువైపులా వారు నెట్టివేసుకోవడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అంటే గడ్డి తీయడం, రాళ్లు ఎత్తడమేనా అని ప్రశ్నించారు. బెటాలియన్‌లో పని చేసే తమ భర్తలు వెట్టిచాకిరీ చేస్తున్నారని, నెలలో 4 రోజులు మాత్రమే ఇంటికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెటాలియన్ పోలీసులకు ఐదేండ్లు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలలకొకసారి పోస్టింగులు మార్చడంతో పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతుందని వాపోయారు. సెలవుల విధానం మార్చాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని కోరారు. శాంతి భద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలో ఏక్ పోలీస్ విధానాన్ని అనుసరించడం లేదని మండిపడ్డారు. విధి నిర్వహణ పేరుతో పోలీసులను వారి కుటుంబాలకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



బేల ఉర్దూ మీడియం పాఠశాలలో తొమ్మిది తరగతులకు బోధిస్తున్న ఒకే ఉపాధ్యాయురాలు

# 'బోధన' అస్తవ్యస్తం

- మొహబత్‌పూర్‌లో ఒక విద్యార్థికి ఒక టీచర్
- బేలలో 136 మందికి ఒకే ఒక్క ఉపాధ్యాయుడు

బేల, అక్టోబర్ 26 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని పలు పాఠశాలల్లో విచిత్ర పరిస్థితి నెలకున్నది. విద్యార్థులు లేనిచోట ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. చాలా మంది విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. ఫలితంగా బోధన అస్తవ్యస్తంగా మారింది.



మొహబత్‌పూర్ పాఠశాలలో బాలుడికి ఒక టీచర్

– బేల మండలంలోని శంషాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో గల మొహబత్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉన్నాయి. ఐదు తరగతులకు గాను ఒకే విద్యార్థి అఖిల్ ఉన్నాడు. ఇతనికి వినోద్ అనే ఉపాధ్యాయుడు రోజు బోధిస్తున్నాడు.

– బేల మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో తొమ్మిది తరగతులు ఉన్నాయి. వీటిలో 136 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఇక్కడ ఒకే ఒక్క ఉపాధ్యాయురాలు నసీం జాను అన్ని తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇక్కడ గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా.. బదిలీలో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కానీ.. ఉర్దూ మీడియం పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో ఒక్కరే దిక్కయ్యారు. ఈ ఉర్దూ మీడియం పాఠశాల మండల విద్యా వనరుల కేంద్రం ముందే ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఎంఈవో కోల నర్సింలును వివరణ కోరగా.. ఇక్కడ ఉపాధ్యాయులు లేని మాట వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తా.

# ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

## వాంతులు, విరోచనాలు కావడంతో దవాఖానకు తరలింపు

- రిమ్స్‌కు తరలిస్తుండగానే మార్గమధ్యలోనే మృత్యువాత
- సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆదివాసులు ఆందోళన
- ఒకరికి ఉద్యోగం, రూ.2 లక్షలు ఇస్తామని రాసిచ్చిన అధికారులు



తుడుందెబ్బ నాయకులు, వాల్గొండా పెద్దలకు రాసిన ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న అధికారులు



మడావి గంగోత్రి(ఫైల్)

ఇంద్రవెల్లి, అక్టోబర్ 26 : ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆదివాసీ గిరిజన విద్యార్థిని మడావి గంగోత్రి(14) వాంతులు, విరోచనాలు కావడంతో శనివారం మృతి చెందింది. కుటుంబీకులు, తోటి విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. వాల్గొండ గ్రామానికి చెందిన మడావి కృష్ణ-జంగుబాయి దంపతుల రెండో సంతానం గంగోత్రి. దసరా సెలవులు ముగియడంతో ఈ నెల 21న(సోమవారం) రోజు పాఠశాలకు వచ్చింది. అప్పటికే గంగోత్రి స్వల్ప అనారోగ్యంతో బాధపడుతుంది. శనివారం తెల్లవారు జమున వాంతులు, విరోచనాలు చేసి స్పృహ కోల్పోవడంతో ఏఎన్ఎం విజయ సిబ్బంది సహకారంతో ఆటోలో మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు రిమ్స్‌కు తరలించాలని సూచించారు. తరలించేలోపే గంగోత్రి మృతి చెందింది. గంగోత్రి బాత్‌రూమ్‌లోనే స్పృహ కోల్పోయి మృతి చెందిందని, ఏఎన్ఎం, పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే చనిపోయిందని బంధువులు ఆరోపించారు.

### పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి

**ఆదివాసీ సంఘాలు, కుటుంబ సభ్యులు, ఆదివాసీ ప్రజలు**

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతిలో చదువుకుంటున్న విద్యార్థిని మడావి గంగోత్రి రెండు రోజుల నుంచి అనారోగ్యం కారణంగా భోజనం చేయలేదని, వాంతులు, విరోచనాలు చేసినా సిబ్బంది పట్టించుకోకపోవడంతో బాత్ రూమ్‌లో స్పృహ కోల్పోయిందని ఆదివాసీ సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆందోళన కార్యక్రమంపై ఆదివాసీ సంఘాల నాయకులతోపాటు వాల్గొండ గ్రామ పెద్దలతో చర్చించారు. గంగోత్రి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని అప్పుడే మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తామని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీంతో ఐటీడీఏ ఏటీడబ్ల్యూవో క్రాంతి, సీఏ మొగిలి ఆధ్వర్యంలో గంగోత్రి కుటుంబానికి ఐటీడీఏ ఈఎస్ఎస్ పథకం ద్వారా రూ.2లక్షల ఆర్థిక సహాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామి ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించారు.